నమస్తే తెలంగాణ
మహబూబ్‌నగర్
నారాయణపేట
5 | మహబూబ్‌నగర్, ఆదివారం 25 ఆగస్టు 2024 | MAHABUBNAGAR NARAYANPET

# గోల్‌మాల్!

- గండీడ్ పీఏసీసీఎస్‌లో రైతుల డిపాజిట్ల సొమ్ము మాయం?
- రూ.15 లక్షలు కాజేసిన వైనం
- సిబ్బంది చేతివాటమని రైతుల ఆరోపణ

గండీడ్/మహ్మదాబాద్, ఆగస్టు 24 : గండీడ్ పీఏసీసీఎస్ గోల్‌మాల్ గోవిందం నడుస్తున్నది. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో చనిపోయిన రైతుల పేరు మీద రుణాలు తీసుకుని వారి పేర్లను సంఘం నోటీసు బోర్డుపై వేశారు. దీంతో వారి వారసులు మాకు తెలియకుండా మా నాన్నలు ఎప్పుడు రుణాలు తీసుకున్నారని అధికారులను నిలదీశారు. ఆ రుణాలతో మీకేం సంబంధం లేదని, వాటిని మేమే కడుతామని మళ్లీ వారినే దబాయించారు. దీనిపై గతంలో 'నమస్తే తెలంగాణ' కథనాన్ని కూడా ప్రచురించింది. అయినా ఉన్నతాధికారులు వచ్చి చూసింది లేదు.. సిబ్బంది చర్యలు తీసుకున్నదీ లేదు. అయితే మరో సంఘటన బయటకొచ్చింది. రూ. 15 లక్షలు రైతుల పేరు మీద ఉన్న డిపాజిట్లు సైతం కాజేశారన్న ఆరోపణలు వినిపిస్తున్నా యి. సంఘం నుంచి రైతులకు పంట రుణాలు ఇచ్చే సమయంలో ఇచ్చిన మొత్తంపై 25 శాతం రైతుల పైరు మీద డిపాజిట్ చేయాలి.. డిపాజిట్ చేసి వారికి బాండ్లు అందించాలి. ఈ విషయాన్ని రైతులకు తెలియజేయాలి. కానీ ఎవరూ వివరించరు. ఇదే అలుసుగా తీసుకొని కొందరు అక్రమాలకు పాల్పడ్డారు. పీఏసీసీఎస్ పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన 225 మంది రైతుల నుంచి డిపాజిట్ల పేరుపై 2010 దాదాపు రూ.15.20 లక్షలు సేకరించారు. 2014 ఏడాదిలో రుణమాఫీ జరిగిన సమయంలో దాదాపు అందరి రుణాలు మాఫీ అయ్యాయి. ఈ సమయంలో తీసుకున్న డిపాజిట్ సొమ్మును తిరిగి రైతుల ఖాతాల్లో జమ చేయాల్సి ఉన్నది. కానీ రైతులకు తిరిగి చెల్లించలేదు. సొసైటీ ఖాతాలో డిపాజిట్ చేసినట్లు ఆధారాల్లేవు. ఈ విషయంలో రైతులకు క్లారిటీ లేక మోసపోయారు. ఎవరైనా విషయం తెలుసుకొని అధికారులను అడిగితే రేపు.. మాపు అంటూ కేవలం పదుల సంఖ్యలోనే ఇచ్చారు. మిగిలింది సిబ్బంది స్వాహా చేశారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ విషయమై సిబ్బందిని అడిగితే సరైన సమాధానం రావడంలేదు. పాలకవర్గం కూడా ఈ విషయాలు తెలియకపోవడంతో రైతులకు న్యాయం చేయలేకపోతున్నది. కాగా, అధికారుల చేతివాటం కూడా ఉండడంతోనే ఎవరూ పట్టించుకోవడం లేదన్న గుసగుసలున్నాయి. ఇప్పటికైనా అధికారులు విచారణ చేపట్టి తేల్చాల్సి ఉన్నది.

గండీడ్ పీఏసీసీఎస్ చైర్మన్ గిరమోని లక్ష్మీనారాయణను వివరణ కోరగా.. రుణాల సమయంలో డిపాజిట్‌కు సంబంధించిన బాండ్లు రైతుల వద్ద ఉంటే ప్రతి ఒక్కరికీ డబ్బులు ఇప్పిస్తామన్నారు. ఇక్కడ సిబ్బంది చాలా ఏండ్లుగా పని చేస్తున్నారని, అక్రమాలకు పాల్పడినట్లు తెలిస్తే బదిలీ చేస్తామన్నారు. సంఘంలో అవినీతిని అరికట్టి రైతులకు లాభం చేకూరేలా చూస్తామని తెలిపారు.

## రూ.30వేల రుణం మాఫీ కాలే..



నా పేరున ఉన్న మూడెకరాలకు బ్యాంక్‌లో రూ.30వేలు పంట రుణం తీసుకున్నా. ఎందుకు మాఫీ కాలేదో అర్థం కావడం లేదు. మూడు విడుతల్లో మాఫీ అవుతుందోమోనని ఆశగా ఎదురుచూశాను. లక్షలు తీసుకున్న వారికి మాఫీ అయ్యింది. మాలాంటి పేద రైతుల కడుపుకొట్టారు. ఇలాంటి దిక్కుమాలిన పాలన వచ్చినందుకు సిగ్గుపడుతున్నాం.

*- ఆంజనేయులు, చంద్రకల్ గ్రామం, పెద్దకొత్తపల్లి మండలం, నాగర్‌కర్నూల్ జిల్లా*

## పొంతనలేని సమాధానాలు..



నాకు నాలుగెకరాల భూమి ఉన్నది. రూ.లక్షా 80 వేల క్రాప్ లోన్ తీసుకున్నా. ఏ లిస్టులో కూడా నా పేరు రాలే. ఎందుకని బ్యాంకోళ్లు, అగ్రికల్చర్ ఆఫీసర్లను అడిగితే ఒకరిపై ఒకరు నెట్టేసుకుంటున్నారు. రుణ మాఫీ గందరగోళంగా చేశారు. ఓడలో ఉన్నంత వరకు ఓడ మల్లన్న, ఓడ దిగాక బోడి మల్లన్న అన్న చందంగా కాంగ్రెస్ వ్యవహరిస్తోంది.

*- బండి రవి, చంద్రకల్ గ్రామం, పెద్దకొత్తపల్లి, నాగర్‌కర్నూల్ జిల్లా*

## సర్కారు మోసం చేసింది..



ఎన్నికలప్పుడు షరతులు లేకుండా రుణమాఫీ చేస్తామని రేవంత్‌రెడ్డి చెప్పారు. ఇప్పుడు రేషన్‌కార్డు లేదని, పేర్లు తప్పులున్నాయని అధికారులు పొంతన లేని మాటలు చెబుతున్నారు. నాకు, మా నాన్నకు కలిపి రూ.2.10లక్షల వ్యవసాయం పంట రుణం తీసుకున్నాం. మూడు విడుతల్లో ఇప్పటికీ ఒక్క పైసా కూడా మాఫీ కాలేదు. నమ్మిన రైతును హస్తం పార్టీ నిలువునా మోసం చేసింది.

*- లాల్‌సింగ్ నాయక్, రైతు, కేస్లీతండా, వెల్దండ మండలం*



చంద్రకల్ గ్రామ పంచాయతీ కార్యాలయం

- మంత్రి జూపల్లి ఇలాకాలో రైతులకు మొండి 'చేయి'
- చంద్రకల్‌లో 1,500 మందికి సగమే మాఫీ
- రైతు కుటుంబాల్లో పెరుగుతున్న గొడవలు
- పట్టించుకోని అధికారులు, సర్కారు
- బ్యాంకులు, వ్యవసాయ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు

## తప్పులుంటే లోనెలా ఇచ్చారు?



నేను రూ.2లక్షల పంట రుణం తీసుకున్నా. మూడు విడుతల్లో మాఫీ చేసినా నా పేరు ఏ లిస్టులోనూ రాలేదు. ఎందుకని వ్యవసాయ, బ్యాంక్ అధికారులను అడిగితే వివరాల్లో తప్పులున్నాయని చెబుతున్నారు. తప్పులుంటే రుణం ఎట్లా ఇచ్చారో అర్థమైతలేదు. కాంగ్రెస్ ఎన్నికలకు ముందు ఇచ్చిన ఏ ఒక్క హామీ అమలు చేయలేదు. ప్రజా ప్రభుత్వమంటూ గొప్పలు చెప్పడం తప్పా చేసిందేమీ లేదు.

*- చిల్వేర్ వెంకటయ్యగౌడ్, కొట్ర,గ్రామం, వెల్దండ మండలం, నాగర్‌కర్నూల్ జిల్లా*

## కేసీఆర్ పాలన బాగుండే..



సింధనూర్ ఏపీజీవీబీలో గతేడాది మా కుటుంబంలో ముగ్గురం రుణం తీసుకుంటే ఒక్కరికి కూడా మాఫీ కాలేదు. మూడు జాబితాల్లో మా పేర్లు లేవు. బ్యాంకోళ్లను అడిగితే తెల్వదంటున్నరు. అగ్రికల్చర్ ఆఫీసర్లను అడిగితే సర్కారు చెప్పినట్లు చేసినమంటున్నరు. ఎవరిని అడగాలో అర్థమైతలే. బోగస్ మాటలు చెప్పి రేవంత్ సర్కారు మోసం చేస్తున్నది. కేసీఆర్ పాలనలోనే బాగుండే.

*- మహేశ్, రైతు, కొత్తపల్లి, అయిజ మండలం, గద్వాల జిల్లా*

## చావు కబురు చల్లగా చెబుతున్నరు..



నాకున్న నాలుగు ఎకరాల భూమిపై రూ.లక్షా 30వేల క్రాప్ లోన్ తీసుకున్నా. మూడు సార్లు వచ్చిన లిస్టులల్ల నా పేరు లేదు. ఎందుకు రాలేదని అధికారుల వద్దకు వెళ్లి అడిగితే డొంక తిరుగుతు సమాధానాలిస్తూ చావు కబురు చల్లగా చెబుతున్నారు. మాఫీ విషయం ఇక ఎవరిని అడగాలో తెలియడం లేదు. కేసీఆర్ ఉన్నప్పుడు సకాలంలో రైతుబంధు వచ్చేది. కాంగ్రెస్ సర్కారు వచ్చినంక రైతుభరోసాకు ఎగనామం పెట్టారు. రైతులను మోసం చేసే ఏ ప్రభుత్వం కూడా ఎక్కువకాలం ఉండదు.

*- స్వామి, చంద్రకల్ గ్రామం, పెద్దకొత్తపల్లి మండలం*

# రుణం.. రణం

కొల్లాపూర్/పెద్దకొత్తపల్లి, ఆగస్టు 24 : రుణమాఫీ.. దేశానికి అన్నం పెట్టే రైతుల కుటుంబాల్లో చిచ్చుపెట్టింది. కొల్లాపూర్ నియోజకవర్గంలో రణరంగంగా మారింది. అర్హత ఉండీ మాఫీ కాకపోవడంతో రైతుల కుటుంబాలను ఆందోళనకు గురిచేస్తున్నది. దీంతో బ్యాంక్, వ్యవసాయశాఖ అధికారుల మధ్య రైతులు నలిగిపోతున్నారు. అంతేకాకుండా తీసుకున్న రుణంపై వడ్డీ ముక్కుపిండి మరీ వసూలు చేస్తున్నారు. దీంతో ఈ నిబంధనలన్నీ ముందే చెప్పి ఉంటే వడ్డీ కట్టి మొత్తం మాఫీ అయ్యేలా చూసుకునేవారమని, ఇప్పుడు వడ్డీ భారం మోపుతున్నారని పెద్దకొత్తపల్లి మండలం చంద్రకల్ రైతులు వాపోతున్నారు. అధికారం కోసం ఎన్నికల సమయంలో ఇష్టానుసారం హామీలిచ్చి నేడు వాటికి కొర్రీలు పెట్టి అర్హులకు అన్యాయం చేయడం తగదన్నారు. గ్రామంలో 1,500 మంది రైతులు ప్రభుత్వం విధించిన కటాఫ్ తేదీలోగా రుణం తీసుకున్నారు. ఇందులో కేవలం 700 మందికి మాత్రమే మూడు విడుతల్లో మాఫీ అయ్యింది. మిగిలిన వారికి అవుతుందో లేదో తెలియక బ్యాంకులు, ఏఈవోల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నట్లు మండిపడ్డారు. మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రాతినిథ్యం వహిస్తున్న నియోజకవర్గంలో రుణమాఫీ కానీ రైతుల పరిస్థితి ఘోరంగా మారింది. కేవలం మాటలకే తప్పా చేతల ప్రభుత్వం కాదని రైతులు అక్కసు వెళ్లగక్కుతున్నారు.

## తగిన బుద్ధి చెబుతాం..



మల్దకల్ యూనియన్ బ్యాంకులో రూ.1.60 లక్షల రుణం తీసుకున్నా. ఏ లిస్టులో నా పేరు రాలేదు. ఏ లెక్కన రుణమాఫీ చేస్తున్నరో తెలుస్తలేదు. పంటరుణం ఇచ్చినప్పుడు లేని తప్పులు రుణం మాఫీ చేసేటప్పుడు ఎట్లకెళ్లి వస్తున్నయి. రైతులను మోసం చేసినోళ్లు ఎవరూ బాగుపడరు. మా ఉసురు పోసుకుంటున్న కాంగ్రెసోళ్లకు బుద్ధి చెప్పే రోజులు దగ్గర్లోనే ఉన్నయి.

*- మొహినుద్దీన్, రైతు, బైనపల్లి, అయిజ మండలం, జోగులాంబ గద్వాల జిల్లా*





*ఓ వైపు పచ్చని చెట్లతో పచ్చదనం వెల్లివిరుస్తూ ఆహ్లాదకరం వాతావరణం కనిపిస్తుండగా.. మరోవైపు మోడు వారిన చెట్లు మధ్యలో మరింత అందంతో కనువిందు చేస్తున్నాయి. 'తరలిరాద తనే వసంతం.. తన దరికిరాని వనాల కోసం' అన్నట్లు కురుస్తున్న వర్షాలతో చెట్లు మారాకు వేయగా.. అలాగే మోడువారిన చెట్లు సైతం మళ్లీ చిగురించాలని ఆశిద్దాం.. వనపర్తి జిల్లా పెద్దమందడి మండల కేంద్రం శివారులోని ఈ దృశ్యాన్ని నమస్తే ఫొటోగ్రాఫర్ తన కెమెరాలో క్లిక్ మనిపించాడు.*

*- వనపర్తి ఫొటోగ్రాఫర్, ఆగస్టు 24*

# మిషన్ భగీరథ నీటి విడుదల

వనపర్తి, ఆగస్టు 24 (నమస్తే తెలంగాణ) : ఐదు రోజులుగా మిషన్ భగీరథ నీటి సరఫరా నిలిచిన క్రమంలో శనివారం యథావిధిగా విడుదల పునఃప్రారంభమైంది. భగీరథ పైపులైన్‌పై వాల్వ్‌ను ఏర్పాటు చేసే క్రమంలో నీటి సరఫరా నిలిచిపోయింది. దీంతో గ్రామాల్లో తాగునీటి ఎద్దడి ఏర్పడింది. దీనిపై 'నమస్తే తెలంగాణ'లో 'భగీరథ నీళ్లు బంద్' కథనం ప్రచురితమైంది. సమస్యపై మిషన్ భగీరథ ఎస్‌ఈ వెంకటరమణ స్పందించారు. వాల్వ్ పనుల వల్ల కొంత అంతరాయం ఏర్పడిందని, శుక్రవారం పొద్దుపోయినా పనులను పూర్తి చేసినట్లు వెల్లడించారు. ఈ వాల్వ్‌ల ఏర్పాటుతో భవిష్యత్‌లో జిల్లాలో నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడదన్నారు. అలాగే అనారోగ్య సమస్యలు తలెత్తకుండా క్లోరినేషన్, బ్లీచింగ్ పౌడర్ చల్లడం వంటివి చేపడుతున్నామన్నారు.



మరమ్మతులను పరిశీలిస్తున్న బీఆర్‌ఎస్ నేతలు

నమస్తే ఎఫెక్ట్

**అధికారులు, పాలకవర్గం నిర్లక్ష్యంతోనే సమస్య**

వనపర్తి టౌన్, ఆగస్టు 24 : మున్సిపల్ సిబ్బంది, పాలకవర్గం నిర్లక్ష్యంతోనే తాగునీటి ఎద్దడి ఏర్పడిందని మున్సిపల్ మాజీ చైర్మన్ శ్రీధర్, మాజీ కౌన్సిలర్ తిరుమల్ అన్నారు. పోచగుట్ట వాటర్ ట్యాంక్ వద్ద చేపడుతున్న మరమ్మతులను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పదేండ్ల బీఆర్‌ఎస్ పాలనలో నీటి కొరత ఏర్పడిన దాఖలాలు లేవన్నారు. నెల కిందటే వాల్వ్, పైపులైన్ మరమ్మతులు చేయాల్సి ఉన్నా నిర్లక్ష్యం చేయడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారని ఆరోపించారు. స్థానికంగా వాల్వ్, షెటర్లు పనిచేస్తున్నాయో? లేదో తెలుసుకోవడంలో అధికారుల దృష్టికి నెల కిందటే తీసుకెళ్లినా పట్టించుకోలేదన్నారు.



శాఖాపూర్ శివారులో అలుగు పారుతున్న చెక్‌డ్యాం

# అలుగు పారిన ఆనందం

- శాఖాపూర్ చెక్‌డ్యాం వద్ద కేసీఆర్‌కు జైకొట్టిన రైతులు



బీఆర్‌ఎస్ జెండాలతో నినాదిస్తున్న నాయకులు, రైతులు

మూసాపేట(అడ్డాకుల), ఆగస్టు 24 : అడ్డాకుల మండలం శాఖాపూర్ శివారులోని పెద్దవాగుపై నిర్మించిన చెక్‌డ్యాం అలుగు పారుతుండడంతో రైతుల ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. కేసీఆర్ ప్రభుత్వంలో ఆల వెంకటేశ్వర్‌రెడ్డి కృషితో శాఖాపూర్ శివారులోని కందూరు స్టేజీ వద్ద రూ.5 కోట్లతో చెక్‌డ్యాం నిర్మించారు. ఇటీవల కురిసిన వర్షాలకు చెక్‌డ్యాం అలుగు పారింది. దీంతో రైతులు, స్థానిక బీఆర్‌ఎస్ నాయకులు శనివారం అక్కడకు చేరుకొని ఆనందాన్ని వ్యక్తం చేశారు. బీఆర్‌ఎస్ నాయకులు పార్టీ జెండాలు చెక్‌డ్యాంలో పాతి జై కేసీఆర్, జై ఆల వెంకటేశ్వర్‌రెడ్డి అంటూ నినాదాలు చేశారు.

# సీహెచ్ పట్టివేత


గద్వాల అర్బన్, ఆగస్టు 24 : నిషేధిత సీహెచ్‌ను పట్టుకున్నట్లు డీటీఎఫ్ సీఐ సైదిరెడ్డి పేర్కొన్నారు. ఆయన కథనం మేరకు.. శనివారం కేటిదొడ్డి, ధరూర్ మండలాల్లోని గ్రామాల్లో కల్లు దుకాణాలపై మెరుపుదాడులు నిర్వహించారు. ఈ క్రమంలో కేటీదొడ్డి మండలంలోని రంగాపురంలో తనిఖీలు నిర్వహిస్తుండగా, 2 కేజీల 200 గ్రాముల సీహెచ్ లభ్యమైంది. దుకాణ నిర్వాహకుడు జంగిలప్ప పరారీలో ఉన్నాడు. ఈ వ్యవహారంలో ఇంకా ఎవరెవరు ఉన్నారన్న దానిపై విచారణ చేపట్టారు. పాతపాలెం గ్రామం నుంచి సరఫరా అవుతుందని సమాచారం రాగా పోలీసులు గ్రామాన్ని సందర్శించారు.

కాగా, అధికార పార్టీకి చెందిన ఓ నాయకుడి పాత్ర ఇందులో ఉన్న ట్లు గుసగుసలు వినబడుతున్నాయి. ఇతడిపై గతంలోనూ కేసులు నమోదయ్యాయని సీఐ వెల్లడించారు. ఈ వ్యవహారంలో ఎవరున్నా వదిలే ప్రసక్తి లేదని తేల్చిచెప్పారు. కాగా, సీహెచ్ పట్టివేతలో నాయకుడు ఎమ్మెల్యే వర్గం కావడంతో.. ఈ విషయం తెలుసుకున్న మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ వర్గం పట్టుపట్టి కేసు నమోదు చేసేందుకు అధికారులపై ఒత్తిడి తెచ్చినట్లు సమాచారం


# నాటి రాజదర్బార్ ఏదీ?

- శిథిలావస్థలో సంస్థానాధీశుల కట్టడం
- గద్వాలలో కనుమరుగవుతున్న చారిత్రక ఆనవాళ్లు
- పట్టించుకోని అధికార యంత్రాంగం

గద్వాల టౌన్, ఆగస్టు 24 : గద్వాల సంస్థానం పేరు చెబితేనే కళలు.. సాహిత్యం.. అపూర్వ కట్టడాలు.. రాజపాలన ఇట్టే గుర్తుకొస్తాయి. అంతటి చరిత్ర కలిగిన కట్టడాలు నేడు కాలగర్భంలో కలిసిపోతున్నాయి. రాబోయే రోజుల్లో ఒకప్పుడు కళాఖండాలు ఉండేవని భవిష్యత్ తరాలు చర్చించుకునే దుస్థితి దాపురించనున్నది. గద్వాల సంస్థానాధీశుల కాలంలో నిర్మించిన రాజదర్బార్‌ను కళాశాలకు అప్పగించిన తర్వాత ల్యాబ్‌కు అనుకూలంగా మార్చారు. కొన్ని సంవత్సరాలపాటు ఎందరో విద్యార్థులు దర్బార్ నీడన ప్రయోగాలతో చదువుకొన్నారు. ప్రస్తుతం కళాశాల అధికారులు దర్బార్‌ను స్టోర్ రూంగా మార్చేశారు. దీంతో భవనం శిథిలావస్థకు చేరింది. రాజులు, సంస్థానాల గొప్పతనాన్ని చాటిచెప్పే కట్టడాలను గాలికొదిలేస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. కనీసం మరమ్మతులు చేపట్టి నాటి జ్ఞాపకాలను పదిలంగా కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.



రాజదర్బార్ భవనం



ఏడంకణాల దర్బార్



శిథిలావస్థకు చేరిన రాజదర్బార్ పై భాగం